# ...తడి ఆరనీకు!



వడ్డి ఓంప్రకాష్ నారాయణ్

**"నా ప్రశ్నకు సమాధానం చెప్పావు కాదు" మధుకర్‌ని రెట్టించాను. వాడిని రెట్టించి ప్రశ్నించే చనువు నాకుంది.**

**తాగుతున్న సిగరెట్‌కున్న నుసిని యాష్ ట్రేలో రాల్చి, తల తిప్పి నా వైపు చూసి "ఏంటదీ" అన్నాడు యధాలాపంగా.**

"అదే... కథలు రాయడం మానేశావేం" మళ్ళీ అడిగాను.

ఇంతలో హోటల్ బోయ్ కాఫీ తెచ్చి, టీపాయ్ మీద పెట్టి వెళ్ళాడు.

ఆ కప్పుల్ని ఇద్దరం తీసుకున్నాం. కాఫీని నిదానంగా సిప్ చేస్తూ, ఇంటరాగేషన్ చేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ని చూసినట్టుగా నా వంక చూసి, "ఏమో... ఏమీ రాయ బుద్ధి కాలేదు. మంచి ప్లాట్ కూడా దొరకలేదు. అందుకే రాయలేదు" అన్నాడు.

"అది కాదు గానీ, విషయం చెప్పు... పెళ్ళికి ముందు రెండేళ్ళలో ముప్పై కథలు రాసిన వాడివి... పెళ్ళయిన రెండేళ్ళ వరకూ ఒక్క కథ కూడా రాయలేదేం" వాడి నోట నిజం చెప్పించాలన్నది నా కోరిక. నేను బాగా ఇష్టపడే రచయిత్లో వాడూ ఒకడు. ఒకప్పుడు వాడు రాసే ప్రతి కథకూ నేనే ప్రథమ శ్రోతని. నాకు కథ చదివి వినిపించాకే వాడు పత్రికలకి పంపేవాడు. అందుకనే వాడు కథలు రాయకపోవడానికి కారణం తెలుసుకోవాలనే ఉత్సుకత నాకంతగా కలిగింది.

"రోజూ ఆలస్యంగా ఇంటికి వెళ్తూ... మా ఆవిడకి కథలు చెప్పడమే సరిపోతోంది. ఇంకా కథలేం రాస్తాను" అన్నాడు నవ్వుతూ.

"మరీ పాత జోక్... ఇంకేదైనా బలమైన కారణం చెప్పు" అన్నాను చిరాగ్గా.

❁ ❁ ❁

వాడెప్పుడూ అంతే... ఏ ప్రశ్నకీ సూటిగా సమాధానం చెప్పడు. అలా అని మన మాట వినడని కాదు. ప్రతి ప్రశ్నకి ఏదో ఆలోచించి సమాధానం చెప్పాలన్నట్టుగా వుంటుంది వాడి ప్రవర్తన. దానికి విసిగిపోయే మా కాలేజీ మేట్స్ అందరూ 'మేధావి' అనే ఓ బిరుదు తగిలించి, వాడికి దూరంగా జరిగిపోయారు. కానీ నాకు వాడితో చిన్నప్పటి అనుబంధం. మా ఇళ్ళు బెజవాడ, సత్యనారాయణ పురంలో పక్కపక్కనే వుండేవి. ఉద్యోగరీత్యా వాడు నా కంటే ముందే హైదరాబాద్ వచ్చాడు. ఆ వెనకే నేను జత కలిశాను. ఇక్కడకు రాగానే తనకున్న బి.ఏ. క్వాలిఫికేషన్‌కి ఓ సోషల్ ఆర్గనైజేషన్‌లో చేరాడు. ఆ తర్వాత ఉస్మానియా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఎమ్మే తెలుగులో చేరాడు. నేను బి.కామ్ కాబట్టి ప్రైవేట్ కంపెనీలో అక్కౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. ఇద్దరం కల్సి చిక్కడపల్లిలో ఓ రూమ్‌లో వుండేవాళ్ళం. అప్పట్లో మాకు జీవితంలో పెద్ద లక్ష్యాలంటూ ఏవీ వుండేవి కాదు. ఉదయం లేచి కావలసింది వండుకోవడం... ఆఫీసులకు వెళ్ళటం... సాయంత్రం తీరిక వేళల్లో త్యాగరాయ గానసభకో, సిటీసెంట్రల్ లైబ్రరీలో జరిగే కార్యక్రమానికో హాజరు కావడం. సాహిత్య కార్యక్రమాలు ఏం లేకపోతే, బెజవాడలో సినిమాలు చూస్తుండే అలవాటును కొనసాగిస్తూ, దీపక్‌లోనో, వెంకటేశ్వరలోనూ ఫస్ట్‌షో సినిమా చూసేవాళ్ళం. తెలుగు సాహిత్యంతో ఏర్పడిన సాంగత్యంతో మధుకర్‌లో రచనలు చేయాలనే కుతూహలం పెరిగింది. రాత్రుళ్ళు రూమ్‌లో కూర్చుని ఏవో రాతలు రాస్తూ వుండేవాడు. పొద్దునే లేవగానే నన్ను కూర్చోపెట్టి చదివి వినిపించేవాడు. నిర్మొహమాటంగా నా అభిప్రాయాన్ని చెప్పే వాడిని. అలా అలా కథలు రాస్తూ, పత్రికలకు పంపడం మొదలు పెట్టాడు. భాష మీద వాడికున్న పరిజ్ఞానం, కథలోని చక్కటి సందేశం కారణంగా అవి ప్రచురణకు నోచుకునేవి. రెండు మూడు సార్లు బహుమతుల్ని గెలుచుకున్నాడు. రచయితగా వాడికో గుర్తింపు వస్తున్న సమయంలోనే స్వప్నతో పెళ్ళయ్యింది. తనూ మంచమ్మాయే. ఈడు జోడు బాగుందని ఎంతో సంతోషించాను. వాడు వేరుగా కాపురానికి సిద్ధమౌతున్న సమయంలోనే నాకు ముంబాయికి బదిలీ అయ్యింది. చెంబూర్‌లో హెడ్‌క్వార్టర్స్‌కు పిలిపించారు. 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' అని అనుకుంటూ ముంబాయికి బైలుదేరాను. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇలా హైదరాబాద్ వచ్చి మధుకర్‌తో నాలుగు రోజులు గడిపే అవకాశం వచ్చింది. ఉత్తరాలు రాసే అలవాటు లేని నేను ఈ రెండేళ్ళలో మధుకర్‌తో పెద్దగా కాంటాక్ట్‌లో వున్నదీ లేదు. వాడు పెళ్ళయ్యాక ఆ సోషల్ ఆర్గనైజేషన్ జాబ్‌కు రిజైన్ చేసి, ప్రింట్ మీడియాలో చేరాడని మాత్రం తెల్సింది. చెంబూర్‌లో జరిగిన నా పెళ్ళికి వాడు రాలేదనే ఒక్క కోపం తప్పితే వాడి మీద నాకున్న అభిమానం ఈ రెండేళ్ళలోనూ ఇసుమంతైనా తగ్గలేదు. నా స్నేహితుడు మంచి రచయిత అని నేను ఇక్కడ, అక్కడ అందరికీ చెప్పుకునే మధుకర్ ఇవాళ ఆ రచనా వ్యాసంగానికి ఎందుకు దూరమయ్యాడన్నది నాకు అర్థం కాని ప్రశ్న. అందుకనే మొన్న కోణార్క్‌ దిగిన దగ్గర నుండి అదే ప్రశ్నను మళ్ళీ మళ్ళీ అడుగుతూనే వున్నాను. సమాధానం లేదు.

❁ ❁ ❁

"ఇంతకీ మీ ఆవిడ్ని తీసుకురాలేదెందుకు" మాట మార్చాలనే వాడి ప్రయతాన్ని నేను గమనించాను.

"తనూ ఉద్యోగం చేస్తోంది. నేనంటే ఆఫీస్ డ్యూటీ మీద వచ్చాను కాబట్టి నాలుగైదు రోజులు వుంటాను. శలవు దొరకటం కష్టమని రాలేదు. అయినా స్వప్న, నువ్వు ముంబాయి వచ్చినప్పుడు పరిచయం చేస్తాన్లే" అన్నాను.

"నువ్వు ఇంటికి రాకుండా ఇక్కడ హోటల్‌లో దిగడం నాకేమాత్రం నచ్చలేదురా" నిష్ఠూరంగా అన్నాడు వాడు.

"కంపెనీ పే చేస్తున్నప్పుడు కాదనడం ఎందుకనే హోటల్లో దిగాను. రేపెలాగు బ్రేక్‌ఫాస్ట్ మీ ఇంట్లోనే... సరేనా" అన్నాను.

"అలాగే" అంటూ మధుకర్ సెలవు తీసుకున్నాడు.

❁ ❁ ❁

"కొత్త ఉద్యోగం ఎలా వుంది. సోషల్ ఆర్గనైజేషన్ నుండి ఒక్కసారిగా ప్రింట్ మీడియాకి వచ్చావు కదా... నీ చదువుకు తగ్గ ఉద్యోగం... బాగానే ఎంజాయ్ చేస్తూ వుండి వుంటావు" అన్నాను మధుకర్‌తో.

స్వప్న వడ్డించిన ఇడ్లీని కారప్పొడిలో అద్దుకుని తింటూనే.

"ఇట్స్ ఓకే... బాగానే వుంది. ప్రస్తుతం నేను ఫిల్మ్ రిపోర్టింగ్ చేస్తున్నాను" అన్నాడు.

"ఓహో... వెరీగుడ్. ఇక రోజూ చిరంజీవి, నాగార్జున, మహేష్‌బాబు... దాసరి... రాఘవేంద్రరావు వీళ్ళతోనే కబుర్లన్నమాట. వాళ్ళంతా నీతో క్లోజ్‌గా మూవ్ అవుతారేమో కదా" అన్నాను ఉత్సాహంగా.

ఇంతలో స్వప్న మరో రెండు ఇడ్లీలు వడ్డిస్తూ "ఆ సంగతేమోకానీ, స్టార్ హోటళ్ళ తిండికి అలవాటు పడి, నా వంట నచ్చట్లేదంటున్నారు... మీరైనా చెప్పండి అన్నయ్యా" అంది నవ్వుతూ.

"ఏరా సినిమా స్టార్స్‌తో స్నేహం కలిసే సరికీ ఇంటి తిండి వెగటుగా వుందా" దబాయిస్తున్నట్టుగా అడిగాను.

"ఛ.. ఛ... అటువంటిదేం లేదు" అన్నాడు.

"సరే ఇంతకీ సినిమా ముచ్చట్లు చెప్పు. ఇక్కడుండగా తెగ సినిమాలు చూసేవాళ్ళం. ముంబాయికి వెళ్ళాక... తెలుగు సినిమా అంటే మొఖం వాచిపోయింది. ఇవాళ నేనిక ఫ్రీ. నన్నేదైన షూటింగ్‌కి తీసుకుపోరాదు" అన్నాను.

"అది మాత్రం అడగకండి అన్నయ్యా... పెళ్ళయిన రెండేళ్ళలో నన్నేనాడు ఆయన సినిమా స్టూడియోకి తీసుకెళ్ళలేదు. ఓ షూటింగూ చూపించలేదు" అంది స్వప్న దెప్పి పొడుస్తూ.

"అవి చూస్తే... నువ్వీక జన్మలో సినిమాలు చూడవు" అన్నాడు వాడు.

"స్వప్న విషయం వదిలేయ్ రా... నా కివాళ ఎవర్ని చూపిస్తావో చెప్పు" అన్నాను.

"తప్పదా" భారంగా అన్నాడు.


"నో... వే"

"సరే" అంటూ ఆనంద్ సినీ సర్వీస్‌కు ఫోన్ చేసి, సిటీలో జరిగే సినిమాల వివరాలు తెలుసుకున్నాడు. వాటినో కాగితం మీద రాసుకున్నాడు.

"నీ కెవర్ని చూడాలని వుంది" అన్నాడు ఊరిస్తూ.

"ఇంకెవరూ చిరంజీవి" అన్నాను.

"సారీరా... చిరంజీవి, నాగార్జున... వీళ్ళంతా సినిమాలుచేయడం బాగా తగ్గించేశారు. యేడాదికి ఒకటో.. రెండో అంతే... ప్రస్తుతం ఆంధ్రాలో యూత్ ట్రెండ్ నడుస్తోంది. ఏదో ఓ షూటింగ్ చూపిస్తాలే... పద" అన్నాడు.



ఇవాళ నాకంటూ కొన్ని బాధ్యతలు ఏర్పడ్డాయి. నన్ను నమ్మి నాతో జీవితాన్ని సాగించడానికో భార్య వుంది. రేపోమాపో పిల్లలు పుడతారు. వాళ్ళకో చక్కటి భవిష్యత్తును చూపించాలి. నీకు తెలుసుగా నాకు మా ఇంటి నుండి ఆర్థికంగా వచ్చి చేరేదేమీ లేదు.

కాఫీ తాగి స్వప్న దగ్గర శలవు తీసుకుని, వాడితో బైక్ మీద జూబ్లీహిల్స్‌కు బైలుదేరాను. విశాలమైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రోడ్లు చూస్తుంటే ఈ రెండేళ్ళలో హైదరాబాద్ ఎంత డెవలప్ అయ్యిందా అనిపించింది. చంద్రబాబు తెచ్చే వరల్డ్ బ్యాంక్ రుణాల్నీ ఈ రోడ్లు వేయడానికే ఖర్చు పెడుతున్నాడేమో!

ప్రసాద్ లాబ్స్, శబ్దాలయా, తెలుగుదేశం ఆఫీస్, అన్నపూర్ణ స్టూడియోస్, చెక్‌పోస్ట్ దాటి... ఫిల్మ్ నగర్ మీదుగా రామానాయుడు స్టూడియోస్‌కి చేరాం.

అక్కడంతా కాలేజీ వాతావరణం కనిపిస్తోంది. ఇదంతా జూనియర్ ఎన్టీఆర్ సినిమా 'సుబ్బు' కోసం వేసిన కాలేజీ సెట్ అన్నాడు. విచిత్రంగా ఆ వాతావరణాన్ని గమనిస్తూ, సెట్‌లోకి వెళ్ళాను. అంతా చీకటి. మధ్యలో మాత్రం లైటు వెలుగుతోంది. కాసేపటికి కళ్ళు ఆ చీకటికి అలవాటు పడ్డాయి. దాదాపు అరవై డబ్భైమంది మా చుట్టూ వున్నారు. ఎవరి పనుల్లో వాళ్ళు బిజీ బిజీగా అటు ఇటు తిరుగుతున్నారు. నాలుగు కుర్చీలు వున్నచోటుకు మధుకర్ నన్ను వెంటతీసుకెళ్ళాడు. బహుశా నిర్మాత అనుకుంటా... మధుకర్‌ని చూడగానే "నమస్తే సార్.. ఏమిటీ తమరి దర్శనాలే కరువయ్యాయి. మా సినిమా షెడ్యూల్ మొదలై వారం అయ్యింది. మేం కనిపిస్తున్నట్లే లేదు మీకు" అన్నాడు.

"అబ్బే అదేం లేదు... కాస్త బిజీ. అందువల్లే రాలేదు" అంటూ ఓ కుర్చీ నాకు చూపించి, మధుకర్ కూడా కూర్చున్నాడు. ఇంతలో డైరెక్టర్ వచ్చాడు. ఆయన అదే తరహాలో మధుకర్‌ను విఐపిలా ట్రీట్ చేయడం మొదలు పెట్టాడు. ఇంతలో నిర్మాత ప్రొడక్షన్ బోయ్‌ని పిలిచి, కాఫీలకు ఆర్డర్ వేశాడు. ఆ ఐదు నిముషాలు గడవగానే హీరో, హీరోయిన్ వచ్చి మా పక్కనే కూర్చున్నారు. వాళ్ళందరినీ నాకు మధు పరిచయం చేశాడు. సినిమా హీరో, హీరోయిన్లు, దర్శక, నిర్మాతలతో వాడంత చనువుగా మాట్లాడుతుంటే... నాకు ఆశ్చర్యంగా అనిపించింది. వీళ్ళందర్ని ఎప్పుడైనా చూడగలనా... అని చిన్నప్పుడు అనిపించేది. వీళ్ళు చేసే సినిమాలు చూడటానికి ఇంట్లో చెప్పకుండా... దొంగచాటుగా థియేటర్‌కి వెళ్ళేవాళ్ళం. ఒక్కసారి తాకితే చాలు అనుకునేంత క్రేజ్ వుండేది. ఇవాళ వీళ్ళ మధ్యలో కాలు మీద కాలేసుకుని కాఫీ తాగడం... ఓ థ్రిల్‌గా అనిపించింది. ఈలోగా అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చి 'సార్ షాట్ రెడీ' అన్నాడు. "జస్ట్ ఫైవ్ మినిట్స్" అంటూ డైరెక్టర్, హీరో, హీరోయిన్ మధుకర్ దగ్గర పర్మిషన్ తీసుకుంటున్నట్టుగా చెప్పి కెమెరా ముందుకు వెళ్ళారు. వాడు చేస్తున్న ఫిల్మ్ రిపోర్టర్ ఉద్యోగానికి ఇండస్ట్రీలో ఇంత ప్రాధాన్యత వుందా అనిపించింది. చూస్తుండగానే రెండు మూడు గంటలు గడిచిపోయాయి. మధ్యాహ్నం లంచ్ అక్కడే చేశాం. నిదానంగా నాకు వినుగు పుట్టడం మొదలైంది.

"ఇక బైలు దేరదాం రా" అన్నాను. ఇద్దరం బైటకి వచ్చాం. ఫ్లోర్ బైట జనం... బహుశా షూటింగ్ చూడటానికి ఫిల్మ్ నగర్‌కి వచ్చివుంటారు. గేట్ దగ్గర బోయ్‌ని లోపలకు పంపమంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. ఆ ఫ్లోర్ బైటే వరుసగా నాలుగు ఫారిన్ కార్లు. ఆ కార్లవంకా మధుకర్ ఆరాధనగా చూడటం నేను గమనిస్తూనే వున్నాను.

స్టూడియోనుండి బయటకు రాగానే "నువ్వెప్పుడూ దుర్గం చెరువు రాలేదుగా" అన్నాడు మధుకర్.

"లేదు" అన్నాను. దాంతో బైక్‌ని రోడ్ నెంబర్ 25 నుండి అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైపు పోనిచ్చాడు. ఆ రోడ్ చివరకి వెళ్ళేసరికి కొండ... దాని క్రింద విశాలమైన చెరువు. దానికి ఆ పక్క ఈ పక్క టెంట్స్ వేసి వున్నాయి. ఎ.పి. టూరిజం శాఖ అక్కడో బ్రాంచ్‌ను పెట్టింది. ఆ చెరువులో బోట్ షికార్ చేయొచ్చు. కొండ మీద నుండి కిందకు దిగటం మొదలు పెట్టాం. చెరువు ఒడ్డున వున్న కౌంటర్‌లో టిక్కెట్స్ తీసుకుని ఇద్దరం పెడల్ బోట్స్ ఎక్కాం. చల్లటి సాయంత్రం. కొండల్ని దిగుతూ సూర్యుడు. మాకు కొద్ది దూరంలో ఓ ప్రేమ జంట బోట్‌లో షికార్ చేస్తోంది. చాలా ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. ఇంత చక్కటి అనుభూతుల్ని కలిగించే హైదరాబాద్ వదిలి కాంక్రీట్ జంగిల్ లాంటి ముంబాయి పోయి నేను కోల్పోయిందేమిటో అర్థమౌతోంది. అలా అలా చెరువు మధ్యకు చేరాం. అస్తమిస్తున్న సూర్యుడిని తదేకంతో చూస్తున్న మధుకర్‌ని మళ్ళీ ప్రశ్నించాను.

"కథలెందుకు రాయడం లేదు"

"మళ్ళీ మొదలా... అసలు నన్నెందుకిలా వేధిస్తున్నావ్? సరే... చెప్పక పోతే వదిలేలా లేవు కానీ చెబుతా విను" గంభీరంగా అన్నాడు వాడు.

వాడిలో స్పందన కలగడం నాకు సంతోషాన్ని ఇచ్చింది. "సరే చెప్పు' అన్నాను సీరియస్‌గా.

"పెళ్ళయ్యాక నేను కథలు రాయడం మానేశాను. అంతకు ముందు నా జీవితానికో లక్ష్యం లేదు. కానీ ఇవాళ నాకంటూ కొన్ని బాధ్యతలు ఏర్పడ్డాయి. నన్ను నమ్మి నాతో జీవితాన్ని సాగించడానికో భార్య వుంది. రేపోమాపో పిల్లలు పుడతారు. వాళ్ళకో చక్కటి భవిష్యత్తును చూపించాలి. నీకు తెలుసుగా నాకు మా ఇంటి నుండి ఆర్థికంగా వచ్చి చేరేదేమీ లేదు. కథలు రాయడానికి నాకు తీరకలేదనో, ప్లాట్ దొరకలేదనో సాకు చెప్పడం నాకిష్టం లేదు. నిజాయితీగా చెబుతున్నాను. కథలు రాయడం వల్ల నాకు అదనంగా ఒనగూడే ప్రయోజనం ఏదీ లేదు. పేపర్లో పేరు చూసుకోవడానికో, లేదా పత్రికలు పంపే మొక్కుబడి పారితోషికానికో నా విలువైన కాలాన్ని వదులు కోవడం నాకే మాత్రం ఇష్టం లేదు. ఈ మెకానికల్ లైఫ్‌లో ఇవాళ కథలు చదివి మనుషులు మారతారా... అలాంటప్పుడు నేనెవరి కోసం కథలు రాయాలి? అందుకనే ప్రస్తుతం నా గురించి, నా

## రుద్రాక్ష ప్రయోజన

రుద్రాక్ష పరిమాణం, లభ్యమయ్యే ప్రాంతాలు, వృక్ష స్వరూపం మొదలైన వివరాలతో దీని ప్రయోజనం ఎంతవరకు వుందో గమనిస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తా యి. రుద్రా+అక్ష= శివుని కన్నుగా ప్రతీతి. ఈ రుద్రాక్షను వివిధ నామాలతో ఫాలాక్ష, నీలకంఠ, తృణమేరు, శర్వాక్ష, భవాక్ష, శివాక్ష, భూతనాశన, హరాక్ష, పుష్పచామర, పావన మొదలగు వాటిగా పిలుస్తారు. దీనికి తంత్రశాస్త్రం, యోగశాస్త్రం, జపాలలోనేగాక వైద్యశాస్త్రంలో వైద్యానికి దీని వృక్షపు వేరు, పండు, గుజ్జు, పువ్వులు, విత్తనం ఎంతో ఉపయోగపడతాయి. రుద్రాక్ష పండు రుచికి పుల్లగావుండి వేడిచేసే స్వభావం కలిగివుంది. అయితే శ్లేష్మాన్ని, వాతాన్ని తగ్గించి రోగనిరోధకంగా పనిచేస్తుంది. హృదయ రోగాల్ని, గ్రహదోషాలనుకూడా నివారిస్తూ, బుద్ధిని, వివేకాన్ని ప్రసాదిస్తుంది. శివుని ధ్యానించునపుడు ఇది ధరించాలి. శివభక్తులు శాంతికి చిహ్నంగా ధరిస్తారు. రుద్రాక్ష ధరించినవారికి భోజనం పెట్టిన కైలాసానికి పోతారు. రుద్రాక్ష ధరించి చనిపోయినవారికి మోక్షప్రాప్తికలుగుతుంది. దీనిని ధరించకుండా ఎన్నిపూజ లు, యజ్ఞాలు, మంత్రాలు, జపాలు చేసినా వ్యర్థమే. రుద్రా క్షను చూసినా, తాకినా, జపించినా పాపాలు నశిస్తాయి. మనశ్శాంతి లభి స్తుంది. దీనిని పవిత్రజలంతో కడిగి తర్వాత ధరించాలి. అది ధరించినంతకాలం ఆకస్మిక మరణంఏర్పడదు. ఎటు వంటి భయాలుండవు. ఇక దీని పువ్వులు అవ స్మారకం, మూర్ఛ, తలతిప్పుట వంటి వాటిని పారదోలుతాయి. పువ్వులు, రుద్రాక్షలు వివిధ గుణాలు కలిగియుండి వేరువేరు ప్రాంతాల్లో వేరువేరు లక్షణాలు కలిగివున్నట్లుగా వైద్య శాస్త్రజ్ఞులు తెలిపారు. నేపాల్ రుద్రాక్ష రక్తపోటు, గుండెపోటు, బ్రెయిన్ హేమరేజ్, చర్మవ్యాధులను, హిమాలయాలు, బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌వి తలనొప్పి, మూర్ఛ, ఉన్మాదం పరిస్థితులను, కర్నాటక, నీలగిరి, ఆనెమల రుద్రాక్ష దగ్గు, ఉబ్బసం, టైఫాయిడ్, జ్వరం, సన్నిపాతం వంటి వ్యాధులను నివారించడానికి ఎంతో ఉపయోగపడతాయి. అస్సాంరకం అల్సర్, అతిసారం, కీటక విషాలను తొలగించేవిగా ఉంటాయి. రుద్రాక్షలేకాక, వృక్ష ఆకుల కషాయం నరాల బలహీనత, ఇస్నోఫీలియాలను పోగొడుతుంటే, చెట్టు వేరు రోగ క్రిములను దరిజేరకుండా తాయెత్తులా పనిచేస్తుంది. రుద్రాక్ష భస్మంగాని లేదా గంధంలా అరగదీసి నీళ్ళతో సేవించడం వంటి విధానాలలో వైద్యశాస్త్రంలో ఇది ఎంతో ప్రాముఖ్యతను సంతరించు కొంది. ఆరోగ్యరీత్యా ఏ విధంగా ఉపయోగపడుతుందో గమనిస్తే సి విటమిన్, సిట్రిక్ యాసిడ్, ఆల్కలాయిడ్స్, ట్రేసెస్ ఆఫ్ ఫిక్స్‌డ్ ఆయిల్ లాంటి రసాయనిక ద్రవ్యాలు వున్నాయి. రుద్రాక్షలు సహజంగా ముదురు ఎరుపులో ఉంటాయి. వైద్యపరంగా ఇన్ని భౌతిక ప్రయోజనాలు కలిగిన రుద్రాక్షలు ఆధ్యాత్మికంగా చూస్తే అద్భుత ఫలితాలు అందిస్తున్నాయి. వివిద ముఖాల రుద్రాక్షల ధారణతో వివిధ కార్య, కామ్య సిద్ధులు ప్రాప్తిస్తాయి.

– డా॥ ఆమంచి బాల సుధాకరశాస్త్రి

**SRI MAHARISHI RUDRAKSHA & NAVARATHNA EMPORIUM**
No. : 13 Gayathri Towers,
Opp. Old Busstand,
Near Kesineni Tours & Travels
VIJAYAWADA-2
Phones : 0866-570199, 663335
BRANCH OFFICE :
6-3-354/10, Hindinagar,
Punjagutta, HYDERABAD.
Phone : 040-6636686, 6636696

భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటూ కథలకు ఫుల్‌స్టాప్ పెట్టాను. అర్జునుడి చూపు పక్షి కన్ను మీద ఉన్నట్లుగా ఇప్పుడు నా లక్ష్యం ఒక్కటే. నేనున్న సినిమా రంగంలో సక్సెస్ వున్న వాడికే ప్రాధాన్యత. వాడి చుట్టూనే పరిశ్రమ అంతా చేరుతుంది. బెల్లం చుట్టూ ఈగల్లా. కాబట్టి నేనూ దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. వీలైనంత త్వరగా ఓ మంచి ఫ్లాట్ తీసుకోవాలి. అవకాశం వుంటే ఓ కారు కొనుక్కోవాలి, బ్యాంకులో నాలుగైదు లక్షలు బాలెన్స్ మెయిన్‌టెన్ చేయాలి... ఓ.కె" అన్నాడు స్థిరంగా.

వాడి సమాధానం నాకో రకంగా షాక్ లాంటిదే!

నేనింకేమీ మాట్లాడలేకపోయాను.


అందులో దూరంగా 'హెల్ప్... హెల్ప్' అంటూ కేకలు వినవడ్డాయి. అటువైపు చూస్తే, మాతో పాటే బైలుదేరిన ప్రేమికుల జంట వున్న బోటు దూరంగా రెండు రాళ్ళ మధ్యలో ఇరుక్కుపోయి వుంది. వాళ్ళు బయటకు రాలేని స్థితి. ఆ అమ్మాయి చున్నీని గాలిలో ఊపుతూ ఆందోళనగా 'హెల్ప్' అంటూ అరుస్తోంది. అప్పటి వరకూ మధుకర్ సమాధానంతో చైతన్య రహితంగా వున్న నేను "మధు... వాళ్ళు సాయం కోరుతున్నారు... అటుపోనీ బోటుని" అన్నాను. వాడోసారి ఆ వైపు చూసి, "ఖంగారు పడాల్సిందేమీ లేదు... మనం ఒడ్డుకు చేరి... టూరిజం వాళ్ళని పంపుదాంలే, వాళ్ళే ఇవతలకు లాగుతారు. నేను ఏడింటికి ఆడియో ఫంక్షన్‌కి పోవాలి. టైమ్ ఎక్కువలేదు" అన్నాడు నిశ్చింతగా.

నా నోట మాట రాలేదు. వాడు పెడల్‌ని వెనక్కి తొక్కడంతో నేను మౌనం వహించాను. అలలు లేని దుర్గం చెరువు ప్రశాంతంగా వున్నా... నా మనసులో మాత్రం ఆలోచనా తరంగాలు సుడులు తిరుగుతూనే వున్నాయి.

❁ ❁ ❁

నన్ను హోటల్ దగ్గర దించి మధుకర్ ప్రెస్ మీట్‌కి వెళ్ళిపోయాడు.

రాత్రి డిన్నర్ చేయబుద్ధికాలేదు. నిద్రా పట్టలేదు. ఏదో అసంతృప్తి. మధుకర్ ఇలా మెటీరియలిస్ట్‌గా మారాడంటే నమ్మబుద్ధి కావడంలేదు. వాడి భావాల్ని నేనెందుకు ఖండించలేకపోయాను! వాడి వాదనలోనూ నిజముందని నేను నమ్ముతున్నానా. అదే ఆలోచనలతో కలత నిద్రలోకి జారిపోయాను. తెలతెల వారుతుండగా మెలుకువ



వచ్చింది. ఓసారి మధుకర్ జీవన గమనాన్ని అవలోకించుకున్నాను. వాడిలో మార్పుకు కారణం ఏమిటో నిదానంగా బోధపడసాగింది. దాన్ని వాడికి విడమర్చి చెబితే ప్రయోజనం వుంటుందేమోనని చిగురంత ఆశ... అందుకే ఓ చిన్న ప్రయత్నం చేశాను. వాడికి ఉత్తరం రాయడం మొదలు పెట్టాను.

**ప్రియమైన మధు...**

ఇదే ఊరిలో వుండి నీకు ఇలా ఉత్తరం రాయాల్సిన పరిస్థితి రావడం ఎంత విచిత్రం! ఎందుకో నా మనసులో భావాల్ని నీలాగా అందంగా కాగితం మీద పెట్టే అలవాటు నాకు చిన్నప్పట్నించి అలవడలేదు. నువ్వు మంచి రచయితవి. నీ ఫీలింగ్స్‌ను చక్కగా కన్వే చేయగలవు. ఎదుటి వాళ్ళ మనసును నీ వాదనతో గెలవగలవు. నిన్న నువ్వు నాతో మాట్లాడాక నువ్వు చెప్పిందే నిజమా అనే భావన నాకు కలిగింది. కానీ ఎక్కడో ఏదో వెలితి. కథలు రాయడానికి, నువ్వు జీవితంలో స్థిరపడ్డానికి నిజంగా సంబంధం ఏదైనా వుందా... లేదేమో కదా! నాకు తెలిసి కథలు రాయడం అనేది స్పందించే మనసుకు నంబంధించింది. మనం చదువుకునే రోజుల్లో ప్రతి చిన్న విషయానికి నువ్వు స్పందించే వాడివి. నీలోని ఆ స్పందించే గుణానికి నాకు తెలిసిన కారణం... అప్పట్లో నువ్వు పనిచేసిన సోషల్ ఆర్గనైజేషన్ కావచ్చు. వాళ్ళు చేసే సేవా కార్యక్రమాల ప్రభావం నీమీద నీకు తెలియకుండానే పడి వుండొచ్చు. నిస్వార్థంగా సమాజానికి సేవ చేస్తున్న ఓ సంస్థ నీడలో వున్న నీకు - నీవంతు సాయంగా ఏదైనా చేయాలనే ఆలోచన కలిగి వుంటుంది. అందుకనే నీలోని భావాలకు అక్షర రూపం ఇస్తూ చక్కటి కథలు రాశావు. కానీ ఇవాళ నువ్వుంది సినీ మాయా లోకంలో. కమర్షియలిజానికి పెద్ద పీట వేసే ఈ రంగంలో అంతా స్వార్థమే. స్వలాభాపేక్షే. ఇక్కడ చిరునవ్వుకి, కంటి తడికీ వెలకడతారు. ఈ రంగంలో మంచి లేదని కాదు. కానీ ఆ మంచి పైకి కనిపించదు. లేదా దాన్ని చేతకానితనంగా జమకడతారు. ఈ రంగం నీ పట్ల చూపించే ఆదరణ, ఆప్యాయత, వినయం, విధేయత, భయం, భక్తి అంతా నీ 'రిపోర్టర్' పదవికే కానీ నీకు కాదు. ఆ తేడాను నువ్వు ముందు గమనించాలి. ఆ ఎండమావినే ఒయాసిస్సు అనుకుని నువ్వు పరుగులు ప్రారంభిస్తే మాత్రం చివరికి నిరాశకు గురౌతావ్.

> నా దృష్టిలో రచయిత ఏటికి ఎదురీదాలి. కథ రాయడం అదే కాగితాన్ని నలుపు చేయడం కాదు. నిద్రిస్తున్న లోకానికి మేలుకొలుపు పాడటం. ఆ పాట చైతన్య ప్రవాహంగా మారి, మనిషిలో, అతని జీవన పథంలో మార్పును తేవడానికి కారణం కావాలి.

ఓ మాట చెప్పనా... అరిస్టాటిల్ అన్నట్టు 'మనిషి సంఘ జీవి'. ఆ సంఘం లేకపోతే మనం లేం. ఏ గూటి చిలక ఆ పలుకులే పలుకుతుందని చెప్పినట్టుగా... మన చుట్టూ వున్న వ్యక్తుల ప్రభావమే మన చర్యల మీద ప్రతిఫలిస్తుంటుంది. ప్రతి దానికీ 'నాకేమిటి లాభం?' అనే ఆలోచించే ఈ సినీ రంగంలో నీ మనసునూ స్వార్థపు మేఘాలు కమ్ముకున్నాయి. వాటిని దాటి బయటకు రావడానికి ప్రయత్నించు. ఏటివాలున కొట్టుకుపోయే వాళ్ళు సామాన్యులు. ఎదురీది సత్యాన్ని గ్రహించి, నలుగురికీ ఆ దాన్ని చెప్పే వాళ్ళే అసమాన్యులు. నా దృష్టిలో రచయిత ఏటికి ఎదురీదాలి. కథ రాయడం అదే కాగితాన్ని నలుపు చేయడం కాదు. నిద్రిస్తున్న లోకానికి మేలుకొలుపు పాడటం. ఆ పాట చైతన్య ప్రవాహంగా మారి, మనిషిలో, అతని జీవన పథంలో మార్పును తేవడానికి కారణం కావాలి. నిన్న నువ్వు అన్నావ్... ఇవాళ కథలు చదివి ఎవరు మారతారని? నీకో నిజం చెప్పనా... నీ కథలు నిన్ను ఎంతవరకూ మార్చాయో తెలియదు గానీ వాటి ప్రథమ శ్రోతనైన నా మీద ఎంతో ప్రభావాన్ని చూపాయి.

నీకు తెలుసుగా మొదటి నుండి మా ఇంట్లో అమ్మా నాన్న మడి - ఆచారం అంటూ ఎంత నిష్టగా వుండే వాళ్ళో. వాళ్ళ దృష్టిలో అది మంచిదే కావచ్చు. కానీ ఆ వంకతో ఇతర కులాల్ని ఎద్దేవ చేయడం, ఈ సమాజంలో వాళ్ళే ఉన్నతులుగా భ్రమించడం నేను సహించలేక పోయేవాడిని. కానీ వాళ్ళకు ఎదురు చెప్పలేని బలహీనత. అలా తరచూ అంతర్మథనానికి గురౌతుండే నాకు నీ కథలు... అందులోని మానవత్వం, సమానత్వం ఎంతో ఓదార్పునిచ్చేవి. ఎవరి చేతుల్లోనూ లేని ఈ సృష్టిలో జన్మ కారణంగా కులాల్ని ఆపాదించడం ఎంత దారుణం అనిపించేది. పిల్లల పెళ్ళి విషయంలో పెద్దలకు ఎంత పట్టుదల వుంటుందో నీకూ తెలుసు. కానీ నా ఆ పెద్దల మనోభావాలకు వ్యతిరేకంగా నేను మహారాష్ట్రలో వేరే కులానికి చెందిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. దీని వల్ల మా పెద్దలతో ఎంత ఘర్షణ జరిగిందో చెప్పలేను. నీ కథలిచ్చిన మనోబలంతోనే నేను ఈ నిర్ణయాన్ని తీసుకోగలిగాను. నీ రచనల ద్వారా స్ఫూర్తి పొంది ఓ మంచి నిర్ణయం తీసుకున్న నాకు, ఇవాళ నువ్వు 'నేను - నా కుటుంబం' అనే చట్రంలో బిగుసుకు పోయావంటే ఎంతో బాధ కలుగుతోంది... ఆలోచించు. మనం ఈ సిటీకి వచ్చిన కొత్తలో నీ కనుచూపు మేరలో ఏ చిన్న సంఘటన జరిగినా చలించిపోయేవాడివి. ఈ మనుషులు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారని మథన పడేవాడివి. బాధితులకు చేతనైనంత సాయం చేసే వాడివి. ఆ క్షణంలో చెమ్మగిల్లే నీ కళ్ళను నేను తదేకంగా చూస్తుండే వాడిని. అటువంటిది నిన్న దుర్గం చెరువులో కళ్ళముందు ఓ జంట ఇబ్బందుల్లో వున్నా 'మన కెందుకులే' అనే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం నేను ఊహించనిది. స్పందించే గుణాన్ని, మానవత్వాన్ని కోల్పోతే ఇక మనిషి జీవితానికి విలువేముంది? మనుషులు మెటీరియలిస్ట్‌గా మారడానికి ఈ తడి ఆరిన మనసులే కారణం. ఇక మీదట నువ్వు కథలు రాసినా రాయకపోయినా, దయ చేసి నీ మనసు తడి ఆర నీకు. నీ చిన్ననాటి స్నేహితుడిగా, ఇంతకంటే నీకేం చెప్పగలను...

శలవ్
నీ
రాధాకృష్ణ

❁ ❁ ❁

మధ్యాహ్నం 2.25
నాంపల్లి స్టేషన్.

ముంబాయికి వెళ్ళే హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ నాలుగో నెంబర్ ప్లాట్‌ఫామ్ మీద నుండి బయలుదేరడానికి సిద్ధంగా వుంది. ఎస్ - 8లో కిటికీ పక్క సీటులో కూర్చున్నాను. షర్ట్ జేబును తడిమితే తెల్లవారు ఝామున మధుకర్‌కి రాసిన ఉత్తరం తగిలింది. వాడిని స్టేషన్‌కి రమ్మని ఉదయం ఫోన్ చేశాను.

వాడు వస్తాడా...

నా ఉత్తరంను అందుకుంటాడా...

❁ ❁ ❁

